# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

మంగళవారం 08 07 2025

సంపుటి 1 సంచిక 69

పేజీలు : 03

UDYAM / TS-09-0148996



విలేకరులు కావలెను


నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఆసక్తి గల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్
ఆర్.సీ. ఇన్చార్జులు
మండల రిపోర్టర్లు
క్రైమ్ రిపోర్టర్లు

73375 46647

దశ నిజం.. నిర్భయంగా.. PRESS ప్రత్యేక ప్రతినిధి తెలంగాణ
Off. Add.: H. No. 2-1-131/97, 1st floor, Rd no 6, Venkatramana Colony, Nagol, Hyderabad -TG - 500068.
www.DASHANEWS.com

(మీ వివరాలను వాట్సప్లో పంపగలరు)

## ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం

కలెక్టరేట్ ప్రజావాణిలో భూ సమస్యను పరిష్కరించాలని.. ఓ రైతు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసాడు. బొమ్మలరామారం మండలం, నాగినేనిపల్లి గ్రామానికి చెందిన రైతు రాజారెడ్డి, భూ సమస్యను పరిష్కరించమని మీసేవ ద్వారా దరఖాస్తు పెట్టుకున్న తరచుగా రిజెక్ట్ చేయడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసాడు. తనకు న్యాయం చేయాలని ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చిన పట్టించుకోకపోవడం లేదని మండిపడ్డాడు.


దశ, భువనగిరి

## ఉమ్మడి జిల్లాలకు ఇంఛార్జ్‌లను ప్రకటించిన టీపీసీసీ చీఫ్

**దశ, హైదరాబాద్ :** సంస్థాగత నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా ఇంఛార్జ్‌లను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. సోమవారం జిల్లా ఇంఛార్జ్‌లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, 10 ఉమ్మడి జిల్లాల ఇంఛార్జ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి విధానాలను మీనాక్షి వెల్లడించారు. త్వరలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణం ఉంటుందని చెప్పారు. వెంటనే రంగంలోకి దిగాలని ఏఐసీసీ ఇంఛార్జ్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను టీపీసీసీ చీఫ్ నియమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా ఉమ్మడి జిల్లా ఇంఛార్జ్‌లను టీపీసీసీ చీఫ్ ప్రకటించారు.

### ఉమ్మడి జిల్లాల ఇంఛార్జ్‌లు వీరే

1. వంశీచంద్ రెడ్డి , ఖమ్మం
2. సంపత్ కుమార్ , నల్లగొండ
3. అడ్లూరి లక్ష్మణ్ , వరంగల్
4. పొన్నం ప్రభాకర్, మెదక్
5. జగ్గారెడ్డి , హైదరాబాద్
6. కుసుమ కుమార్, మహబూబ్‌నగర్
7. అనీల్ యాదవ్ , ఆదిలాబాద్
8. అద్దంకి దయాకర్, కరీంనగర్
9. అజ్మతుల్లా హుస్సేన్, నిజామాబాద్
10. శివసేన రెడ్డి , రంగారెడ్డి..




## మహేష్ బాబుకు మళ్ళీ నోటీసులు

సాయి సూర్య డెవలపర్స్ రియల్ ఎస్టేట్ వెంచర్ కేసులో రంగారెడ్డి కన్స్యూమర్ కమిషన్ నుంచి మహేష్ బాబుకు నోటీసులు వచ్చాయి. సరైన అనుమతులు తీసుకోకుండా వెంచర్ స్టార్ట్ చేశారని, డబ్బులు కట్టిన వినియోగదారులకు స్థలాలు ఇంకా ఇవ్వలేదని సమాచారం. ఫిర్యాదులో మహేష్ ను మూడో ప్రతివాదిగా పేర్కొన్నారు. యాడ్ చేయడమే అందుకు కారణం.

దశ, హైద్రాబాద్



# అసెంబ్లీ ఎన్నికల్లో 60 సీట్లు

### మహిళలకు ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటా: సీఎం రేవంత్
### ప్రతీ ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటండి



**దశ, హైదరాబాద్:** వనమే మనం..మనమే వనం అని పెద్దలు చెప్పారు. ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుంది. ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం నాడు జరిగిన వనమహోత్సవం 2025 ప్రారంభోత్సవ సభలో అయన మాట్లాడారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమ్మలు కూడా పిల్లల పేరుతో మొక్కను నాటండి. ప్రతీ ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటండి. మీ పిల్లల్లాగే వాటిని సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందని అన్నారు. మహిళలను ప్రోత్సహిస్తూ మా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించాం.

ఆర్టీసీలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాదు. ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశాం. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పట్టణ ప్రాంతాల్లో మహిళలు కూడాను మహిళా సంఘాల్లో చేరండని పిలుపునిచ్చారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్లు రుణాలు అందించాం . అన్ని రంగాల్లో ఆడబిడ్డలను ముందు భాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నాం . త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్ రాబోతోంది. వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 ఎమెల్యే సీట్లు ఇచ్చేబాధ్యత నేను తీసుకుంటానని అన్నారు.

# ఉత్తమ్ గారూ... కుంగింది బ్యారేజి కాదు, మీ బ్రెయిన్

### మాజీ మంత్రి , ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి




**దశ, హైదరాబాద్:** ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి తీరు బోడిగుండుకు మోకాలికి ముడి పెట్టినట్లు ఉంది.మోటార్లు ఆన్ చేసి పొలాలకు నీళ్లు ఇవ్వాలని మేం అడిగితే, కుంగిన బ్యారేజ్ నుంచి ఎత్తిపోయాలా అని ప్రశ్నిస్తున్నారని మాజీ మంత్రి , ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కుంగింది బ్యారేజి కాదు, మీ బ్రెయిన్ ఉత్తం గారు. మేడిగడ్డలో ఒక్క పియర్ కుంగితే, మీ బ్రెయిన్ మాత్రం మొత్తం కుంగినట్లుంది. అసలు బ్యారేజీకి, మోటార్లు ఆన్ చేయడానికి ఏమైనా సంబంధం ఉందా ఉత్తం గారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉండి అజ్ఞానాన్ని బయట పెట్టుకుంటున్నారు. కన్నెపల్లి పంప్ హౌజ్ మినిమం డ్రా లెవల్ 93.5 మీటర్లు అయితే 96 మీటర్ల ఎత్తున నీళ్లు ప్రవహిస్తున్నాయి.. కన్నెపల్లి పంపు హౌస్ మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశాం. అది చేయకుండా మళ్ళీ అవే బురద రాజకీయాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

గోదావరి నీళ్లను రైతుల పొలాలకు మళ్లించాలని మేము అడుగుతుంటే, సాకులు చెబుతూ నీళ్లు కిందకు వదులుతున్నారు. 283 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన రికార్డు ఎలా సాధ్యం అయ్యింది ఉత్తం గారు? మీ 19 నెలల పాలనలో ఒక్క ప్రాజెక్టు కట్టారా? ఒక్క చెక్ డాం నిర్మించారా? ఒక్క చెరువు పూడిక తీశారా? కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్లు ఇచ్చారా? కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ సిస్టమ్ వల్లనే రిజర్వాయర్లు నిండాయి, చెక్ డ్యాంలు చెక్ డ్యాంలు మత్తళ్లు దుంకాయి, చెరువులు నిండుకుండలా మారాయి, భూగర్భ జిల్లాలు పెరిగాయి, పొలాలకు నీళ్ళు అందాయి. బిఆర్ఎస్ సాధించిన ఘనతను, కాంగ్రెస్ ఘనతగా చెప్పుకుంటూ తిరగటం తప్ప మీరు చేసింది ఏముంది?కల్వకుర్తి విషయంలో మీరు ఇచ్చిన ప్రెస్ నోట్ లోనే మీకు సమాధానం ఉంది. నీటి నిల్వల ఆధారంగా ఒక్కో ఏడాది ఒక్కో తేదీన లిఫ్టులు ఆన్ చేస్తుంటారు. మే 30న శ్రీశైలానికి వరద వస్తే ఇప్పటివరకు కల్వకుర్తి మోటార్లు ఎందుకు ఆన్ చేయలేదు. వరద రూపంలో నీళ్లు కిందకు తరలి వెళ్తుంటే జులై, ఆగస్టు అంటూ ముహూర్తాల కోసం ఎందుకు చూస్తున్నారు?రైతు సంక్షేమం పట్ల మీకున్న చిత్తశుద్ధి ఇదేనా?మొద్దు నిద్ర వీడి, కెసిఆర్ గారు డిమాండ్ చేసినట్లు మోటార్లు ఆన్ చేయండి.. పంట పొలాలకు నీళ్ళు ఇవ్వండి. లేదంటే మీ నిర్లక్ష్యం వల్ల వచ్చే కృత్రిమ కరువుకు మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

### అబ్దుల్లాపూర్ మెట్ సబ్ రిజిస్టర్

# ఆఫీసుకు తాళం...

### 40 నెలలుగా రెంటు కట్టకపోవడంతో తాళం వేసిన యజమాని...
### ఆఫీస్ సమయంలో తాళం పెట్టడంతో ఇబ్బంది పడ్డ సిబ్బంది జనం



**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ సబ్ రిజిస్టర్ కార్యాలయానికి ఆ బిల్డింగ్ యాజమాని పిట్టల రాజు ముదిరాజు తాళం పెట్టాడు. గత 40 నెలల నుంచి రెంటు కట్టకపోవడంతో సోమవారం ఉదయం ఆఫీస్ ఓపెన్ చేసే సమయంలో తలాలతో వచ్చిన రాజు ఆఫీస్ డోర్లకు తాళం పెట్టాడు. దీంతో విధులకు వచ్చిన సిబ్బంది అధికారులు, రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన జనం కార్యాలయం బయటే గంటల తరబడి పడికాపులు కాశారు. అయితే తాను 2007 నుంచి తన బిల్డింగ్ ను అబ్దుల్లాపూర్ మెట్ సబ్ రిజిస్టర్ కార్యాలయానికి రెంటుకు ఇచ్చానని తెలిపారు. గతంలో కూడా రెంటు సమయానికి చెల్లించపోవడంతో ఆందోళన చేయాల్సినదుస్థితి వచ్చిందని రాజు తెలిపారు. ప్రతి నెల రెంటు రూ. 12000లు కాగా.. గత 40నెలలుగా దానికి సంబంధించిన రెంటు చెల్లించడం లేదని యాజమాని రాజు చెప్పుకొచ్చాడు. ఇదే విషయాన్ని జిల్లా స్థాయి అధికారుల దృషికి తీసుకెళ్లిన వారు కూడా స్పందించకపోవడంతో తాళం పెట్టానని చెప్పాడు. సమాచారం అందుకున్న పోలీసులు బిల్డింగ్ ఓనర్ను అదుపులోకి తీసుకొని పీఎస్ కు తరలించారు. ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని బిల్డింగ్ ఓనర్ రాజు కు జిల్లా రిజిస్టర్ నుండి హామీ ఇవ్వడంతో బాధితుడికి అదే విషయం చెప్పి ఒప్పించి పోలీస్‌స్టేషన్ నుంచి పంపించారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



- జిల్లాలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహణ
- సమయం చాలా విలువైనది.. వృధా చేసుకోవద్దు
- సేఫ్టీ క్లబ్ ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి.
- డ్రగ్స్ రహిత జిల్లాగా హైదరాబాద్ ను తీర్చిదిద్దాలి.
- జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**దశ, హైద్రాబాద్ :** రోల్ మోడల్ కావాలంటే లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అన్నారు. విద్యార్థులు డ్రగ్స్ దూరంగా ఉండా లని, మంచి మార్గం వైపు నడవాలని విద్యార్థులకు హితబోధన చేశారు. సోమవారం ఏవీ కళాశాల, హైదరాబాద్ సిటీ పోలీస్ సంయుక్తంగా డ్రగ్స్ నిర్మూలనపై చేపట్టిన కార్యక్రమంలో డిసిపి సెంట్రల్ జోన్ శ్రీవల్లితో కలిసి కలెక్టర్ హరిచందన దాసరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సఫలత అనే విషయం అందరికీ ఒకేసారి రాదు అని, ప్రయత్నం చేయడమే విజయానికి

..మిగతా 3వ పేజీలో →

## హైదరాబాద్‌లో 8 మంది ఫేక్ డాక్టర్లు

### తనిఖీల్లో గుర్తించిన టీజీఎంసీ.!

**దశ, హైదరాబాద్:** అర్హత లేకుండానే వైద్యం చేస్తున్న 8 మంది ఫేక్ డాక్టర్లను గుర్తించామని, వారిపై ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ సిటీలోని బౌరంపేట్, దుండిగల్, సూరారం ప్రాంతాల్లో నకిలీ డాక్టర్లు.. యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్, ఐవీ ఫ్లూయిడ్స్ వంటి అధిక స్థాయి మందులను రోగులకిచ్చి హాని కలిగిస్తున్నారు. సమాచారం అందుకున్న టీజీఎంసీ అధికారులు దాడులు నిర్వహించారు. ఆరెంజ్ క్లినిక్ ఎస్ కే. నగులమీరా, బీఎల్ఆర్ క్లినిక్ డా. పి. సూర్యలత, నాని మినీ హాస్పిటల్ కె. వెంకటేశ్, శ్రీ సాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వై. సూర్యనారాయణ, శ్రీ శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్ శివ శంకర్, బాలాజీ క్లినిక్ చి. విట్టల్, నందుశ్వర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ శంకర్ గౌడ్, మస్తాన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఎస్.కె మస్తాన్, సెంటర్లపై టీజీఎంసీ వైస్ చైర్మన్ డా. జి. శ్రీనివాస్, సభ్యుడు డా. విష్ణు బృందాలు దాడులు నిర్వహించాయి.

### ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులను

# ప్రభుత్వం ఆదుకుంటుంది

### ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి




**దశ, రంగారెడ్డి :** విషం చిమ్మే ఫార్మాసిటీ వద్దని తాను మొదటి నుంచి రైతుల పక్షాన నిలబడి పోరాటం చేశానని ఆ పోరాట ఫలితంగా కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ కాకుండా గ్రీన్ ఫార్మసిటిని ఏర్పాటు చేసుకున్నామని, భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని ఇక్కడి భూములు బంగారం కంటే విలువైనవిగా మారుతాయని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం కందుకూరు మండలంలోని మీర్ ఖాన్ పేట్ వద్ద ఫార్మా రైతుల కోసం కేటాయించిన ప్లాట్లను డ్రా పద్ధతి ద్వారా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 4 th సిటీ ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని, దేశంలోనే అతిపెద్ద సీటీ గా పూర్తిగా ఈ ప్రాంతం అవతరిస్తుందన్నారు . ఈ ప్రాంతం నుంచి రేడియల్ రోడ్డు వెళుతున్నందున ఫార్మా రైతుల కోసం ఏర్పాటుచేసిన లేఔట్ లో ధరలు పెద్ద ఎత్తున పెరిగే అవకాశాలు ఉన్నాయని, రైతులు తక్కువ ధరలకు ప్లాట్లు అమ్ముకోవద్దని ఆయన రైతులకు సూచించారు. అలాగే ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం సేకరించిన 2500 ఎకరాల పట్టా భూముల రైతులను కూడా త్వరలో పిలిపించి వారితో మాట్లాడి ఒప్పించి మెప్పిస్తామని అన్నారు. రైతుల కోరుకునే విధంగా పరిహారం అందిస్తామని ఆయన తెలిపారు. నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూముల రైతులకు కూడా అన్ని రకాలుగా న్యాయం చేస్తామని గిట్టని వారు చేస్తున్న విషప్రచానాన్ని నమ్మవద్దని రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందని ఆయన అన్నారు.

దశ
నిజం.. నిర్భయంగా..

02
మంగళవారం
8-7-2025
WWW.
DASHANEWS
.COM



## చరిత్రలో ఈ రోజు


2008 : ప్రపంచ సముద్ర దినోత్సవం
632: ఇస్లాం మతాన్ని స్థాపించిన మహమ్మద్ ప్రవక్త మదీనాలో పరమపదించాడు (జ.570). ఆయన తరువాత కాలిఫ్ అబూబక్ర్ ఆయన బాధ్యతలు స్వీకరించాడు.
1936: భారతదేశపు సివిల్ రేడియో నెట్‌వర్కుకు ఆలిండియా రేడియో గా నామకరణం చేశారు.
1940: నెప్ట్యూనియం (Np)ని ఎడ్విన్ మెక్‌మిలన్ మరియు ఫిలిప్ హెచ్. అబెల్సన్ సంశ్లేషణ చేసారు, వీరు న్యూట్రాన్‌లతో యురేనియం (U)ను అణు విచ్ఛిత్తికి కారణమయ్యారు
1948: భారత, ఇంగ్లాండు మధ్య విమాన రాకపోకలు ప్రారంభమైనవి. భారతదేశము నుండి విదేశాలకు విమాన ప్రయాణాలకు ఇదే నాంది.
1957: భారత హిందీ సినిమా నటి డింపుల్ కపాడియా జననం.
1958: ప్రపంచ కప్ ఫుట్‌బాల్ పోటీలు స్వీడన్ లో ప్రారంభమయ్యాయి.
1975: భారత హిందీ సినిమా నటి శిల్పా శెట్టి జననం. (చిత్రంలో)
2012: భారతీయ సినీ దర్శకుడు కె.ఎస్.ఆర్.దాస్ మరణం. (జ.1936)

# కార్మికులను మోసం చేసే జీఓను వెనక్కు తీసుకోవాలి

❖ జీఓ ప్రతులను దగ్ధం చేసిన సీఐటీయూ నాయకులు



**దశ, భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కార్మికులను మోసం చేస్తూ వారి శ్రమను దోపిడీ చేసే విధంగా పని గంటలు పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఆ ఉత్తర్వులను రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని కార్మికుల ఐక్యతతో ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే. రమేష్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం సీఐటీయూ కొత్తగూడెం పట్టణ కమిటీ అధ్వర్యంలో ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏజె.రమేష్ మాట్లాడుతూ ఇప్పటికే నాలుగు లేబర్ కోర్టులను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తూ అనేక ఇబ్బందులు గురి చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలంగాణ రాష్ట్రంలో పనిగంటలు పెంచుతూ తీసుకువచ్చిన జీవోని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా పాలన సాగిస్తున్నమని మాయమాటలు చెబుతూ ప్రజలకు మోసం చేస్తున్న పద్ధతి సరైనది కాదన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఏ ప్రభుత్వమైన కార్మిక వర్గం ఒక్కతాటి పైన ఉంచి వారి హక్కుల రక్షణ కోసం పోరాటాలు చేస్తామని అన్నారు. పని గంటల సమయం పెంచిన ప్రభుత్వ ఉత్తర్వు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ సిఐటియు నాయకులు లిక్కి బాలరాజు జునుమాల నగేష్ నందిపాటి రమేష్ అభిమన్యు లింగయ్య రాములు రమేష్ హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డల పక్షాన పోరాటం

❖ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడిన పాడి కౌశిక్ రెడ్డి

**దశ, హుజురాబాద్:** భారతదేశంలోనే ఆడబిడ్డల భద్రత కోసం ఆలోచించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్.. కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని , మొదట్లో రూ.50,000 నుంచి ప్రారంభించి, రూ.1,00,116 వరకు పెంచి, ఆడబిడ్డలకు మేనమామలా కెసిఆర్ నిలిచారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కమలాపూర్ మండలానికి చెందిన దాదాపు 100 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "కేసీఆర్ కిట్ నిలిపివేయడం వల్ల ప్రభుత్వాసుపత్రుల్లో డెలివరీలు తగ్గాయని , పేరును మార్చినా సరే, ఆ పథకాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు తక్కలపల్లి సత్యనారాయణ రావు, మాజీ జెడ్పిటిసి నవీన్, ఇంద్రసేనా రెడ్డి కేడిసిసి డైరెక్టర్ కృష్ణప్రసాద్, రవీందర్ రెడ్డి మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నిజామాబాద్‌లో మెరిసిన తార

❖ ఏకాధి సిల్వర్ జ్యువెలరీ షోరూమ్‌ను ప్రారంభించిన ప్రముఖ నటి అనసూయ

**దశ, నిజామాబాద్ :** నిజామాబాద్‌లో ఏకాధి సిల్వర్ జ్యువెలరీ కొత్త షోరూమ్‌ని ప్రముఖ నటి, టెలివిజన్ హోస్ట్ అనసూయ భరద్వాజ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తో కలిసి నిజామాబాద్‌లో ఏకాధి సిల్వర్ జ్యువెలరీ యొక్క షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ, "వారసత్వం, హస్తకళను ప్రోత్సహించే వాటిలో భాగం కావడం ఎల్లప్పుడూ సంతోషాన్నిస్తుంది. ఏకాధి సిల్వర్ జ్యువెలరీ సంప్రదాయం, ఆధునిక డిజైన్‌ల యొక్క ఖచ్చితమైన సమ్మేళనాన్ని అందిస్తోంది, ఇది వెండి ఆభరణాల ప్రియులందరికీ వన్‌స్టాప్ గమ్యస్థానంగా మారుతుంది.ష అని అన్నారు. "లాంచ్‌ను పురస్కరించుకుని, ఏకాధి సిల్వర్ జ్యువెలరీ ప్రత్యేకమైన ఆషాడం పండుగ ఆఫర్‌లను అందిస్తోంది, ఇది పరిమిత కాలానికి చెల్లుబాటు అవుతుంది. కస్టమర్‌లు చేతితో తయారు చేసిన వెండి ఆభరణాలు, బహుమతి వస్తువులు, పూజా వస్తువులు, మరిన్నింటిని ఆకర్షణీయమైన ధరలలో అందుబాటులో ఉన్నాయి" అని ఫ్రాంఛైజర్ సంతోష్ అన్నారు. "రాజమండ్రి మరియు హైదరాబాద్‌లోని తమ స్టోర్‌లు ఘనవిజయం సాధించిన తర్వాత, భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న లగ్జరీ వెండి ఆభరణాల బ్రాండ్ ఏకాధి తన మూడవ స్టోర్‌ను నిజామాబాద్‌లో ప్రారంభించడం ఆనందాన్ని ఇస్తుందని ఏకాధి రాచకొండ డైరెక్టర్ వేణు తెలిపారు.

# సమస్యల పరిష్కారం కొరకే ప్రజావాణి

❖ అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెల్పూర్‌లో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**దశ, హుజురాబాద్:** హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. చెల్పూర్‌తో పాటు సిర్సపల్లి, వెంకట్రావుపల్లె, పోతిరెడ్డిపేట, జూపాక, బోత్తలపల్లె వంటి పలు గ్రామాల నుండి దాదాపు 1500 మంది గ్రామస్తులు తమ కంటి సమస్యలకు పరీక్షలు చేయించుకునేందుకు తరలివచ్చారు. గ్రామ ప్రజల కంటి సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ఉదయం నుంచే వందలాది మంది తరలివచ్చారు. హైదరాబాద్‌లోని శంకర్ ఐ హాస్పిటల్ నుండి వచ్చిన అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల బృందం అత్యాధునిక పరికరాలతో సుమారు 1500 మందికి పూర్తిస్థాయి కంటి పరీక్షలు నిర్వహించింది. కంటిచూపు, శుక్లాలు, గ్లకోమా వంటి వివిధ రకాల సమస్యలను ఈ పరీక్షల్లో గుర్తించారు. పరీక్షల అనంతరం, ప్రాథమిక అంచనా ప్రకారం 250 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. ఆపరేషన్ల ఖర్చులతో సహా పూర్తి వైద్య ఖర్చులను జయన్న ఫౌండేషనే భరిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ గుడిపాటి సరిత జైపాల్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ఏసీబీ వలలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్

**దశ, నల్గొండ:** నల్లగొండ జిల్లా కేంద్రంలోని.. జిల్లా సివిల్ సప్లై శాఖా కార్యాలయంలో ఏసీబీ దాడులు చేశారు. ఓ మూడు వాహనాలను జప్తు నుంచి విడుదల చేయడానికి.. అధికారికంగా చేపట్టాల్సిన పంచనామా కోసం, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ షేక్ జావీద్ ఒక లక్ష రూపాయలను డిమాండ్ చేశాడు. ఆ తర్వాత బాధితుడు బ్రతిమిలాడగా 70 వేల రూపాయలకు ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలోనే, సివిల్ సప్లై శాఖా డిప్యూటీ తహశీల్దార్ జావీద్.. 70 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా మిర్యాలగూడ లో పట్టుబడ్డాడు. ఈ నేపథ్యంలో.. మిర్యాలగూడ ఆఫీస్ తోపాటు.. జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లై శాఖా కార్యాలయలోను సోదాలు చేపట్టారు. ఎవరైనా ప్రభుత్వ అధికారి వారి విధుల్లో భాగంగా చేయాల్సిన పనులను.. లంచం ఇస్తేనే చేస్తామని చెబితే.. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని వైసిపి డిఎస్పి తెలిపారు.

# గడువు తీరినా దేశంలో ఉంటున్న విదేశీయులు అరెస్టు

**దశ, హైదరాబాద్:** వీసా గడువు ముగిసినప్పటికి ఇండియాలోనే ఉన్న నలుగురు విదేశీయులను పోలీసులు గుర్తించారు. ఇద్దరు నైజీరియన్లు, ఒక్కరు టాంజానియ, ఒకరు సుడాన్ దేశస్తులుగా గుర్తించారు. జాతీయ భద్రతా నేపథ్యంలో వారి వారి దేశాలకు పంపించడానికి ఏర్పాట్లు చేసినట్లు టాస్కోర్స్ డీసీపీ సుదీంద్ర వెల్లడించారు. వీరికి మాదకద్రవ్యాల వర్తకులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించాం. కానీ వీరు ప్రత్యేక్షంగా పాల్గొన్నట్లు సాక్ష్యాధారాలు లభించలేదు. ఆయా దేశాలకు తిరిగి పంపించడంతో పాటు ఇండియాకు మళ్ళీ రాకుండా నిషేధం విధించారు,. మెడికల్, స్టూడెంట్, బిజినెస్ వీసాలతో రావడం గడువు ముగిసిన వెళ్లక పోవడం ఒక నేరం. కాగా చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొంటున్నారు. ఇటువంటి వ్యక్తులపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు.

# అభివృద్ధికి కేరాఫ్‌గా ప్రజా ప్రభుత్వం

❖ డివైడర్, సెంట్రల్ లైటింగ్ శంకుస్థాపనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**దశ భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ సహకార చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం భద్రాచలంలో ఒక కోటి 15 లక్షల రూపాయలు వ్యయంతో నిర్మించనున్న డివైడర్ సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రజల ప్రభుత్వం అని ప్రజల సంక్షేమమే ఈ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక రకాల చర్యలు చేపట్టిందన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి ప్రజలకు అండగా పోలీస్ శాఖ

❖ అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్



**దశ, భద్రాద్రి కొత్తగూడెం :** ఆదివాసి ప్రజలకు అండగా పోలీస్ శాఖ నిలుస్తుందని నేషనల్ ఎస్పీ ఆపరేషన్ నరేందర్ అన్నారు. కరకగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగళ్ల గుత్తికొయ గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కరకగూడెం పోలీసుల ఆధ్వర్యంలో రేగళ్ల గుత్తికోయ గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను నిర్వహించడం జరిగిందని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారధ్యంలో ఆదివాసీ ప్రజలకు విద్య వైద్యం రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని అదేవిధంగా నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలోని పొలం పనులకు వెళ్లే మహిళలకు వర్షాకాలం ఇబ్బంది కలగకుండా ప్లాస్టిక్ రైన్ కోట్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం ఎస్సై పివిఎన్ రావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

దశ
నిజం.. నిర్భయంగా..

03
మంగళవారం
8-7-2025
WWW.
DASHANEWS
.COM



# హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు

**దశ, హైదరాబాద్:** ఇంటి ఎదురుగా రోడ్డు ఉంటే కలిపేయడం, పార్కు ఉంటే ఆక్రమించేయడం, కాలువ పైనే నిర్మాణం చేసేయడం, కబ్జాలకు ఏదీ అడ్డు రావడంలేదని పలు ఫిర్యాదులను బట్టి అర్థమౌతోంది. ఎదురుగా ఉన్న ప్లాట్‌కు దారి లేకుండా మరీ కబ్జా చేసేస్తున్నారంటూ పలువురు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. రహదారులను ఆక్రమించడం ,అడ్డంగా గోడ కట్టేయడంతో దారి లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆఖరుకు 20 గజాల స్థలాన్నికూడా వదలడంలేదని.. గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ వద్ద కబ్జా రుజువు చేస్తోంది. నాలాలు పైన ఉన్న వెడల్పు కిందకు వచ్చేసరికి విస్తరించాల్సింది పోయి, కుంచించుకు పోయిన దృశ్యాలు అనేకం ఉన్నాయి. ఇలా సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులు రాగా.. అందులో ఎక్కువ శాతం రహదారులు, పార్కుల ఆక్రమణలపైనే ఉన్నాయి.

## రేపు సార్వత్రిక సమ్మె



**దశ, సూర్యాపేట :** జూలై 9 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో హమాలీ కార్మికులు, మిల్లు డ్రైవర్స్, అంగన్వాడీ మున్సిపల్ కార్మికులు, ఐకేపీ, వి ఓ ఏ,లు మెప్మా రిసోర్స్ పర్సన్, ఆశా వర్కర్స్ పాల్గొని సమ్మె ను జయప్రదం చేయాలని కార్మిక ఉద్యోగ వర్గాలకు బి ర్ టీ యూ జిల్లా అధ్యక్షులు వెంపటి. గురూజీ పిలుపు నిచ్చారు. ఈ రోజు రవీంద్ర, నవోదయ, జయలక్ష్మి రైస్ మిల్ హమాలీల సమావేశం జరిగింది. ఈ సమావేశం నుద్దేశించి బి ర్ టీ యూ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు వెంపటి గురూజీ మాట్లాడు తూ కేంద్రం లో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొస్తూ, భాడా పరిశ్రమల యాజమాన్యంకు అనుకూలంగా, కార్మికుల హక్కులను కాలరాసే విదంగా చట్టాలు సవరిస్తుందని, దేశ వ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు.

## వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ ఆకస్మిక తనిఖీ



**దశ, ఎల్బీనగర్ :** గడ్డిఅన్నారం డివిజన్ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో సోమవారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీల సందర్భంగా అధికారుల హాజరు, కార్యాలయ నిర్వహణ పరిస్థితులు, పరిసరాల పరిశుభ్రతను సమీక్షించారు. కార్యాలయంలో కొంతమంది అధికారులు హాజరు కాకపోవడం, పరిసరాల్లో చెత్త వాతావరణం ఉండడంతో అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలతో వార్డు కార్యాలయానికి వస్తున్నారు... కానీ, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదన్నారు. కార్యాలయం చుట్టూ చెత్త, వీధి కుక్కలు తిరగడం ప్రజల భద్రతకు ప్రమాదంగా మారుతుందన్నారు. ఇటీవల వార్డు కార్యాలయం వద్ద కుక్కలు ప్రజలపై దాడి చేసినట్లు గుర్తు చేశారు.

# ఆటో మాఫియాకు చెక్!

## కొత్త ఆటోల కొనుగోళ్లపై కీలక రూల్స్

- ఆటో కొనుగోలు చేయాలనుకునే వ్యక్తులు డ్రైవింగ్ లైసెన్స్ అడ్రెస్‌తోపాటు మరో అడ్రెస్ ప్రూఫ్ ఏదైనా చూపించాలి
- పర్మిషన్ తీసుకున్న వ్యక్తులకు ఒకరికి ఒక ఆటో పర్మిషన్ మాత్రమే ఇస్తారు
- గతంలో ఆ వ్యక్తి పేరుపై ఆటో రిక్షాలు ఉంటే మాత్రం అనర్హులుగా ప్రకటిస్తారు
- తన పేరు మీద ఎలాంటి ఆటో పర్మిషన్ లేదని అఫిడవిట్ సమర్పించాలి
- తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే చట్టపరంగా చర్యలు
- ముందుగా వచ్చిన వాళ్లకే ప్రథమ ప్రాధాన్యత
- డీలర్లు కూడా ఆర్టీఏ అనుమతులు వచ్చిన వారికే ఆటోలు అమ్మాలి
- ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలి



ప్రాసెసింగ్ పేరుతో, ఇతర సర్వీసుల పేరుతో డబ్బులు వసూలు చేయడం నేరం అవుతుంది. బ్లాక్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. పర్మిట్‌లను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్న ఫైనాన్షియర్‌లు కాసులు దండుకుంటున్నారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకొచ్చిన విధానంతో కొంత వరకు మార్పు వచ్చే అవకాశం ఉందని ఆటో డ్రైవర్లు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఉన్న పర్మిట్‌లు చూపించే కొత్త ఆటోలు కొనుగోలు చేస్తున్నారు. దీనికి కూడా ప్రభుత్వం నో చెప్పడం అక్రమ వ్యాపారానికి అడ్డుకట్టపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**దశ హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్లకు గుడ్ న్యూస్. కొత్త ఆటోల కొనుగోలుపై ఆంక్షలను ఇటీవల ఎత్తేసిన ప్రభుత్వం ఇప్పుడు మరిన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. మాఫియాకు అడ్డుకట్టవేసేలా కీలక నిర్ణయం తీసుకుంది. సిండికేట్‌లకు అవకాశం లేకుండా రూల్స్ ఫ్రేమ్ చేసింది. ఈ మేరకు జీవోను జారీ చేసింది. అవుటర్ రింగ్‌రోడ్ పరిధిలోపు ఉన్న వాళ్లకు మాత్రమే అవకాశం కల్పిస్తోంది.ఈ మధ్యనే ప్రభఉత్వం 65 వేల ఆటో పర్మిట్‌లకు ఓకే చెప్పింది ప్రభుత్వం. ఇందులో ఎలక్ట్రిక్ ఆటోలు 20 వేలు ఉంటే 10 వేల ఎల్పీజీ, మరో 10 వేలు సీఎన్‌జీ పర్మిట్‌లు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న ఎల్పీజీ, డీజిల్, పెట్రోల్ ఆటోలకు మార్పులు చేర్పులు చేసుకొని ఎలక్ట్రిక్‌గా మార్చుకునే వెసులుబాటు కల్పించింది. ఈ పర్మిట్‌లు ఎవరికి ఇవ్వాలనే అంశంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జీవో 263కి అనుగుణంగా ఈ రూల్స్‌ను రూపొందించారు. హైదరాబాద్‌లో పొల్యూషన్ కంట్రోల్ చేసేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెం చేందుకు తీసుకుంటున్న నిర్ణయాల్లో భాగంగా ఆదివారం కీలక మార్గదర్శకాలు విడుదల చేసింది రవాణాశాఖ. తెలంగాణలోని ఏ డీలర్ వద్దైనా సరే ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపింది. అయితే హైదరాబాద్‌లో ఆ ఆటో తిప్పాలనుకునే వారు మాత్రమ లోకల్‌గా డ్రైవింగ్ లైసెన్స్, ఓఆర్ఆర్‌లోపు అడ్రెస్ ప్రూఫ్ ఉండాలని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నట్టు కచ్చితంగా ప్రూఫ్‌లు ఇవ్వాలి. కొనుగోలుదారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడా లేదా అనేది తేల్చాల్సిన బాధ్యత పూర్తిగా డీలర్లకే విడిచిపెట్టారు. వాహనం కొనుగోలు చేసినప్పుడు సదరు వ్యక్తి ఆటో లేదా కారు డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, పుట్టిన తేదీ, ఔటర్ పరిధిలో ఉంటున్నట్టు రెండు అడ్రస్ డాక్యుమెంట్స్ ఇవ్వాలి. ఆ తర్వాత వాహనం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతోంది. వాహనం కొనుగోలుదారు ఇచ్చిన వివరాలు సరిగా ఉంటే ప్రక్రియను ప్రారంభించి వాటిని సదరు డీలర్లు సీఎఫ్ఎస్‌టీ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎంటర్ చేయాలి. ఆ వివరాలను ఆర్టీఏ అధికారులు పరిశీలిస్తారు. 24 గంటల్లోనే దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంటుంది. సదరు వ్యక్తి ఇచ్చిన వివరాలు సరైనో కావో నిర్ధారించుకున్న తర్వాతే వాహనం కొనుగోలు ప్రక్రియ ముందుకెళ్తుంది. ఒకసారి ఆర్టీఏ అధికారులు సదరు వ్యక్తి వివరాలు నిర్ధారించిన తర్వాత డ్రైవర్లు వాహనం కొనుగోలు చేయాలి. ఈ కొనుగోలు కూడా 60 రోజుల్లో పూర్తి చేయాలి. ఆర్టీఏ అధికారుల నుంచి అనుమతులు వచ్చిన 60రోజులు అంటే రెండు నెలలోపు ఆటో కొనుగోలు చేయకుంటే ఆ అనుమతులు ఆటోమేటిక్‌గా రద్దు అవుతాయి. పర్మిట్లకు ఉన్న డిమాండ్ దృష్టిలో ఉంచుకొని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పాత ఆటో పర్మిట్ ఉందని దాని స్థానంలో కొత్త ఆటో కొనేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. ఈ పర్మిట్‌ల ప్రక్రియ సజావుగా సాగేందుకు కొత్త సాఫ్ట్‌వేర్ క్రియేట్ చేశారు.

# సిని"మా"దశ

## 'కాంతార: చాప్టర్ 1' కొత్త పోస్టర్



2022లో విడుదలైన "కాంతార" సినిమా సినిమాకి ప్రీక్వెల్‌గా రాబోతున్న కాంతార: చాప్టర్ 1 పై భారీ అంచనాలు నెలకొన్నాయి. రిషబ్ శెట్టి ఎప్పుడూ చూడని థ్రిల్లింగ్ అవతార్‌లో ఉన్న పోస్టర్ ఇప్పటికే ప్రేక్షకులలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు, రిషబ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసి, షూటింగ్ పూర్తయినట్లు అనౌన్స్ చేశారు.

### కేజేఆర్, 'కోర్ట్' శ్రీదేవిల చిత్రం ప్రారంభం

తెలుగు, తమిళ భాషల్లో 'గుర్తింపు' పేరుతో స్పోర్ట్స్ కోర్ట్ డ్రామాతో హీరోగా పరిచయమవుతోన్న కేజేఆర్ హీరోగా రెండో చిత్రం శ్రీకారం చుట్టుకుంది. సోమవారం పూజా కార్యక్రమాలు జరిగాయి. తెలుగులో ఈ చిత్రాన్ని గంగా ఎంటర్ టైన్మెంట్స్ అందించనుంది.. 'కోర్ట్' చిత్రంతో పేరు తెచ్చుకున్న శ్రీదేవి హీరోయిన్ గా నటించనున్నారు.



## హయత్ నగర్ డివిజన్ లో డిప్యూటీ కమిషనర్ పర్యటన



**దశ, ఎల్బీనగర్ :** హయత్ నగర్ డివిజన్ లోని లక్ష్మిప్రియా కాలనీలో సోమవారం అధికారులతో కలిసి డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పర్యటించి, స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న శానిటేషన్, విద్యుత్ దీపాల సమస్యలను పరిష్కరించాలని అధికారులను కాలనీవాసులు కోరారు. కాలనీలోని ఓపెన్ ప్లాట్ లోని గుడిసెలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి తరచూ అగ్రి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గుడిసెల్లో నివాసం ఉంటున్నవారికి అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీసీ యాదయ్య సూచించారు. వీలైనంత త్వరగా కాలనీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ నీలిమ, ఎస్ఎస్ చంద్రశేఖర్, జవాన్ రామచంద్ర, శానిటేషన్ సూపర్ వైజర్లు నగేష్, యాదయ్య, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మధు, శ్రీధర్ గౌడ్, ఉపేందర్ గౌడ్, పరుషరాములు, మురళి, అచ్చి రెడ్డి, వెంకటేష్, శ్రీనువాసు రెడ్డి, నిరంజన్, నరేష్, జలంధర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 81 గ్రామాలకు సోలార్ వెలుగులు



**దశ,హైదరాబాద్:** తెలంగాణలో 81 గ్రామాలను రూ. 1,273 కోట్లతో సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామాలుగా మార్చేందుకు రెడ్కో టెండర్లు పిలిచింది. ఇందులో రూ. 400 కోట్లు కేంద్రం, రూ. 873 కోట్లు రాష్ట్రం భరిస్తాయి. 16,840 వ్యవసాయ బోర్లు, 40,349 ఇళ్లకు సౌర ఫలకాలు ఏర్పాటు చేస్తారు. రైతులు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించి యూనిట్‌కు రూ. 3.13 ఆదాయం పొందవచ్చు. ఈ పథకం విజయవంతమైతే.. గ్రామాల్లో కరెంట్ బిల్లుల భారం పూర్తిగా తగ్గుతుంది.తెలంగాణ వ్యాప్తంగా 81 గ్రామాలను సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామాలకు మార్చేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇళ్ల పైకప్పులు, వ్యవసాయ బోర్లకు, ఇతర విద్యుత్ కనెక్షన్లన్నింటికీ సౌరశక్తిని వినియోగించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు రూ. 1,273 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్ట్ కింద సౌర ఫలకాల ఏర్పాటుకు రెడ్కో టెండర్లను ఆహ్వానించింది. మొత్తం వ్యయంలో రూ. 400 కోట్లను కేంద్ర నూతన ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ రాయితీగా అందించనుంది. మిగిలిన రూ. 873 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. జూలై 24లోగా టెండర్లను దాఖలు చేయాలని రెడ్కో సూచించింది.ఈ 81 గ్రామాల్లో 16,840 వ్యవసాయ బోర్లు ఉన్నాయి. ఒక్కో బోరుకు 7.5 కిలోవాట్ల స్థాపిత సామర్థ్యం గల సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తారు. సౌర విద్యుత్ ద్వారా ఉత్పత్తి అయిన కరెంటును బోరుకు వాడుకున్నతర్వాత మిగిలింది సాధారణ గ్రిడ్‌కు సరఫరా అవుతుంది. ఈ విధంగా సరఫరా చేసిన విద్యుత్‌కు గాను బోరు యజమానికి యూనిట్‌కు రూ. 3.13 చొప్పున డిస్కంలు చెల్లిస్తాయి. దీనివల్ల రైతలకు పంటల సాగుతో పాటు అదనపు ఆదాయం కూడా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.ప్రస్తుత అంచనాల ప్రకారం 7.5 కిలోవాట్ల సామర్థ్యంతో ఫలకాలను ఏర్పాటు చేయడానికి దాదాపు రూ. 4.50 లక్షల వరకూ ఖర్చవుతుంది. ఇందులో 30 శాతం కేంద్రం రాయితీగా ఇస్తుంది. మిగిలిన సొమ్మునంతా రైతుల తరపున ఈ 81 గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా సౌర కంపెనీలకు చెల్లిస్తుంది. ఇది రైతులపై ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ గ్రామాల్లో ఉన్న 40,349 ఇళ్లపై ఒక్కోదానికి 2 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ పలకాలను ఏర్పాటు చేయాలని రెడ్కో మరో టెండర్ పిలిచింది. మొత్తం 80,698 కిలోవాట్ల స్థాపిత సామర్థ్యంతో ఈ ఫలకాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వ్యవసాయ బోర్లు (126.30 మెగావాట్లు), గృహాలు (80.69 మెగావాట్లు) కలిపి మొత్తం 206.99 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో సౌర ఫలకాలను ఏర్పాటు చేయనున్నారు.

## హైద్రాబాద్ కలెక్టర్ ను కలిసిన టీజీవో నాయకులు



**దశ, హైద్రాబాద్ :** హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో టీజీఓఎస్ అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన వసతి కేటాయించమని కోరుతూ.. హైద్రాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన ని టీజీఓ ప్రతినిధులు కలిసి సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్, ఉపాధ్యక్షురాలు ఎంజులా రెడ్డి, కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి

మార్గం అని చెప్పారు. "ఏదైనా ఒక తలుపు మూసుకుపోతే, ఇంకొక తలుపు తప్పకుండా తెరుచుకుంటుందని, ఎలాంటి ఒత్తిడికీ మానసిక ఆరోగ్యం తక్కువ చేయకండి. డ్రగ్స్‌లాంటి చెడు అలవాట్ల వైపు పోకండి," అని హితవు పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ ఏవీ కళాశాల పూర్వ విద్యార్థులే, ఆయన మాదకద్రవ్యాల వాడకంతో సంబంధం లేకుండా, ఆరోగ్యంగా ఉండేందుకు ఫుట్‌బాల్ ఆడతారని ఉదాహరణగా చెప్పారు. విద్యార్థులు పాజిటివ్ రోల్ మోడల్స్గా మారాలని పిలుపునిచ్చారు. డీసీపీ సెంట్రల్ జోన్ శిల్పావల్లి, మాట్లా డుతూ విలువైన జీవితం, భద్రత, సానుకూల జీవిత దిశగా ప్రయాణం చేసేందుకు మంచి లక్ష్యాన్ని ఎంచుకోవాలని, చెడుకు దూరంగా ఉండాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులంతా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రమాణం చేశారు, వారు నిషేధిత పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగానిలబడతామని, ఆరోగ్యకరమైన జీవనాన్ని స్వీకరిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో ఆశిష్ చక్రవర్తి, డిఅడిక్షన్ థెరపిస్టు డా. దేవికా, ప్రిన్సిపాల్ డా. రాజలింగం, వైస్ ప్రిన్సిపల్ పద్మ, పీజీ డైరెక్టర్ గోపీ కృష్ణ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వాలంటీర్లు, కళాశాల మరియు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.